RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్ దినపత్రిక

వరంగల్ | సంపుటి : 3, సంచిక : 270 | శనివారం సెప్టెంబర్ 27, 2025 | పేజీలు : 4 | వెల : రూ.3-00



**పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం**

2లో..

- జూబ్లీహిల్స్ బైపోల్ బీఆర్ఎస్ అభ్యర్థి ఖరారు
- క్యాండిడేట్‌గా గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత
- సిట్టింగ్ స్థానంలో నెగ్గి పట్టు నిలుపుకునేలా వ్యూహాలు
- ప్రభుత్వ వైఫల్యాలను ఆసరాగా చేసుకోవాలని గులాబీ పార్టీ ఆలోచన



# విక్టరీ కోసం గులాబీ ఆరాటం!

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

జూబ్లీహిల్స్ శాసనసభ ఉపఎన్నికలో గెలుపొందేందుకు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు శక్తియుక్తులన్నీ కూడగట్టుకుంటున్నాయి. సిట్టింగ్ స్థానాన్ని దక్కించుకు నేందుకు బీఆర్ఎస్ గట్టిగా ప్రయత్నిస్తున్నది. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతను అభ్యర్థిగా ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత వరుస పరాభవాలతో అధికారానికి దూరమైన గులాబీ పార్టీ.. ఈ సారి వ్యూహాత్మకంగా ముందుకెళ్లేలా ప్రణాళికలు రచిస్తున్నట్టు కనబడుతున్నది. హైదరాబాద్ అన్ని నియోజకవర్గాల్లో విజయ కేతనం ఎగురవేసిన బీఆర్ఎస్ పార్టీ, ఫిరాయింపులు, కంటోన్మెంట్ ఉపఎన్నికలో స్థానాలను కోల్పోయింది. కానీ ఈసారి మాత్రం ప్రభుత్వ వైఫల్యాలను ఆసరాగా చేసుకుని ఎన్నికల్లో దూసుకెళ్లాలని ప్రయత్నిస్తున్నది. ఇందిరమ్మ ఇళ్లు, పింఛను, మహిళలకు రూ.2,500తో పాటు కాంగ్రెస్ ఎన్నికల హామీలన్నింటినీ ప్రజలకు తెలియజేసే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నది.

**– కేటీఆర్‌ను కలిసిన అభ్యర్థి**

సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో అనివార్యమైన ఉపఎన్నికకు పార్టీ అభ్యర్థిగా ఆయన సతీమణి సునీత పేరును బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రకటించారు. పార్టీలో సీనియర్ నేతగా, జూబ్లీహిల్స్ ప్రజల అభిమాన నాయకుడిగా స్థానం సంపాదించుకున్న మాగంటి గోపినాథ్ సతీమణి మాగంటి సునీతకే ప్రాధాన్యత ఇస్తూ అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు బీఆర్ఎస్ తెలిపింది. చిత్తశుద్ధి కలిగిన నిస్వార్థ నేతగా మాగంటి గోపీనాథ్ పార్టీకి, ప్రజలకు అందించిన సేవలను గౌరవిస్తూ, జూబ్లీహిల్స్ ప్రజల ఆకాంక్షల మేరకు గోపీనాథ్ కుటుంబానికే అవకాశం ఇవ్వాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ ప్రకటించింది. కాగా తనను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంపై మాగంటి సునీత ఆనందం వ్యక్తం చేశారు. గోపీనాథ్ పై నమ్మకంతో, తనపై విశ్వాసంతో ఉపఎన్నికకు అభ్యర్థిగా అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ఈ అవకాశం ఇచ్చిన కేసీఆర్ , కేటీఆర్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎన్నికల్లో ప్రజల మద్దతు, ఆశీర్వాదం ఉండాలని కోరుకుంటున్నానన్నారు. తనను




ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన అనంతరం మాగంటి సునీత, ఆమె కుమార్తెలు తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. ఆపై మాగంటి కుటుంబ సభ్యులు కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. మాగంటి సునీతను కేటీఆర్ అభినందించారు.

## తెలంగాణ నూతన డీజీపీగా శివధర్ రెడ్డి



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

తెలంగాణ డీజీపీగా బి. శివధర్ రెడ్డిని నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నియామక ఉత్తర్వులను అందుకున్నారు. ప్రస్తుతం ఆయన తెలంగాణ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పనిచేస్తున్నారు. అక్టోబర్ 1వ తేదీన తెలంగాణ డీజీపీగా బాధ్యతలు శివధర్ రెడ్డి చేపట్టనున్నారు. కాగా శివధర్ రెడ్డి 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. హైదరాబాద్‌లో జన్మించిన శివధర్ రెడ్డిది రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తూలేకలాన్ (పెద్దతుండ్ల) గ్రామం. ప్రైమరీ స్కూల్ నుంచి ఉన్నత విద్య వరకు హైదరాబాద్‌లోనే ఆయన చదువుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ పూర్తి చేసి కొంతకాలం అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేశారు. ఆ తర్వాత సివిల్ సర్వీసెస్ క్లియర్ చేసి 1994లో ఇండియన్ పోలీస్ సర్వీస్‌లోకి ప్రవేశించారు. ఏఎస్పీగా విశాఖపట్నంలోని అనకాపల్లి, నర్సీపట్నం, చింతపల్లిలో పని చేశారు. గ్రేహౌండ్స్ స్క్వాడ్రన్ కమాండర్‌గా, బెల్లంపల్లి, ఆదిలాబాద్, నల్గొండ, శ్రీకాకుళం, నెల్లూరు, గుంటూరు జిల్లాల ఎస్పీగా సేవలు అందించారు.




## నవోదయకు ఎంపికైన విద్యార్థికి అభినందన

**వేద న్యూస్, చొప్పదండి:**

జాతరగొండ సతీష్ సువర్ణ ల కుమారుడు కౌశిక్ 1వ తరగతి నుండి 4వ తరగతి వరకు స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదివి నవోదయకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థి ని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సన్మానించి, అభినందనలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ నాగరాజు మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్న పేద విద్యార్థులకు మంచి విద్యను లాభాపేక్షలేకుండ గత 30 సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం నవోదయ కు విద్యార్థులను పంపిస్తున్న మొలుమూరి రమేష్ ని కూడా సన్మానించి అభినందించారు.

## రోడ్డు గుంతలమయం





**– సరిచేయాలని ప్రజల విజ్ఞప్తి**

**వేద న్యూస్, వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్ రోడ్డు అధ్వానంగా మారింది. రుద్రంగి, చందుర్తి, కోనరావుపేట మండలాల నుండి షాపింగ్, పండుగ పనుల కోసం వేములవాడకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షంతో ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలికంగా కంకర, డస్ట్ వేసి పనికొచ్చినట్టుగా చూపిస్తున్నారని, తారు రోడ్డు నిర్మాణానికి నిధులు వచ్చాయని ప్రకటన చేసినా, ఇప్పటివరకు పనులు మొదలుపెట్టకపోవడం పట్టణ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. వెంటనే పనులు ప్రారంభించి వాహనదారులు, రాజన్న భక్తులకు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

## కార్మికుల పట్ల చిత్త శుద్ధిలేని ప్రభుత్వం..!



**– సిఐటీయు జిల్లా కోశాధికారి కే నర్సమ్మ ఆరోపణ**

**వేద న్యూస్, టేక్మాల్ :**

మెదక్ జిల్లా టేక్మాల్ గ్రామ పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదని పండగ రోజు పస్తులు ఉండాలా ప్రభుత్వం వెంటనే పెండింగ్ లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను చెల్లించాలని సిఐటీయు జిల్లా కోశాధికారి కే నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం టేక్మల్ మండల కేంద్రం లో గ్రామ పంచాయతీ కార్మికుల ముఖ్య నాయకత్వం తో ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల కు గత 5 నెలల నుండి వేతనాలు ప్రభుత్వము చెల్లించడం లేదన్నారు.సంవత్సరంలో ముఖ్యమైన పండగలు బతుకమ్మ,దసరా పండుగ సంబరాలు ప్రారంభం అయ్యాయన్నారు.ఉదయం నుండి సాయంత్రం వరకు గ్రామాలలో పారిశుద్య పనులు నిర్వహిస్తూ ఇదే పనిపై ఆధారపడి జీవిస్తున్న కార్మికుల వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం కార్మికుల ఉసురు తీస్తుందని అని అన్నారు. పండగ పూట సిఎం మాత్రం పంచభక్ష పరమాన్నాలు తింటే కార్మికులు కనీసం పప్పు అన్నం తినడానికి కూడా వేతనాలు చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పెండింగ్ వేతనాలను చెల్లించాలని,లేనిపక్షంలో పండగ తర్వాత ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల మండల నాయకులు పెంటయ్య,మానయ్య,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏం చేసుకుంటారో చేస్కోండి

**డెస్క్ : హైదరాబాద్ :**

కాంగ్రెస్ నేతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి ధ్వజమెత్తారు. తన అరెస్టుపై కాంగ్రెసోళ్లు రెండేండ్లుగా కలలు కంటూనే ఉన్నారని కేటీఆర్ పేర్కొన్నారు. చూసి చూసి వాళ్ల కళ్లు కాయలు కాస్తున్నాయని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఎల్ అండ్ టీ సంస్థపై మీడియాతో మాట్లాడిన సందర్భంగా కేటీఆర్ అరెస్టుపై ఓ మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు ఈ విధంగా బదులిచ్చారు. రేవంత్ రెడ్డి ఏం చేసినా దాని వెనుకాల ఓ

మిగతా 3వ పేజీలో..




## జర్నలిస్టుల అక్రిడేషన్ల గడువు మరోసారి పొడిగింపు

**డెస్క్, హైదరాబాద్ :**




తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువును మరో మూడు నెలల పాటు పొడిగించారు. ఈ మేరకు ఐ అండ్ పీఆర్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబర్ 30వ తేదీతో ముగియనున్న అక్రిడేషన్ కార్డుల కాల పరిమితిని డిసెంబర్ 31వ తేదీ వరకు పొడిగించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా అక్రిడేషన్ కార్డులను మంజూరు చేయలేదు. గత 22 నెలలుగా అక్రిడేషన్ కార్డుల కాల పరిమితిని ప్రతి మూడు నెలలకు ఒకసారి పొడిగిస్తూనే ఉంది. అక్రిడేషన్ కార్డుల గడువు పొడిగించడం ఇది ఆరోసారి కావడం గమన్హరం.

# కాంగ్రెస్ నాయకుల ఆశలు ఆవిరి..!

## – టేక్మాల్ సొసైటీ చైర్మన్‌గా యశ్వంత్ రెడ్డి

**వేద న్యూస్, టేక్మాల్ :**

టేక్మాల్ సొసైటీ చైర్మన్‌గా పాత పాలక వర్గమే యథాతథంగా కొనసాగుతుందని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో మెదక్ జిల్లా టేక్మాల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా యశ్వంత్ రెడ్డి కొనసాగనున్నారు. గతంలో జరిగిన సొసైటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి యశ్వంత్ రెడ్డి డైరక్టర్‌గా గెలుపొంది చైర్మన్ గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఒక్కసారిగా పరిస్థితులు మారిపోయాయి.

**– పార్టీ మారాలని ఒత్తిడి..?**

సొసైటీ చైర్మన్‌గా కొనసాగాలంటే అధికార పార్టీ కాంగ్రెస్లో చేరాలని ఒత్తిడి తెచ్చారు. పార్టీ మారనని చెప్పడంతో పలువురు డైరక్టర్లతో అవినీతి ఆరోపణలు చేసి ఫిర్యాదు చేశారు. ఆరోపణల నేపథ్యంలో విచారణ కొనసాగుతుంది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా సొసైటీల పాలకవర్గం పదవి కాలం పూర్తయినా ఎన్నికలు జరగకపోవడంతో పాత పాలకవర్గానికి గడువు పొడిగించింది. చైర్మన్ పదవిపై కన్నేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. ఇంకా విచారణ కొనసాగుతున్న క్రమంలో అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ఫలితంగా ఈ నెల 9వ తేదీన డైరక్టర్ నర్సింహారెడ్డికి సొసైటీ చైర్మన్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు ఇస్తూ డీసీవో కరుణాకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం ఇచ్చిన ఉత్తర్వులను అదే రోజున సాయంత్రం మళ్లీ క్యాన్సల్ చేశారు. ఏం జరిగిందో తెలియదు కానీ, 11వ తేదీన నర్సింహారెడ్డి ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నట్లు డీసీవో మళ్లీ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన బాధ్యతలను చేపట్టారు. ఎందుకు ఇచ్చారు ? ఎందుకు క్యాన్సల్ చేశారు? మళ్లీ ఎందుకు ఇచ్చారు? అనే విషయం అప్పట్లో జిల్లా వ్యాప్తంగా చర్చానీయాంశమైంది.

**– అక్రమ పద్దతుల్లోకి అధికారంలోకి..**

అవినీతి ఆరోపణలు రుజువు కాకముందే విచారణ కొనసాగుతున్న సమయంలో అక్రమంగా వేరే వారికి చైర్మన్ పదవి కట్టబెట్టారని హైకోర్టును ఆశ్రయించినట్లు యశ్వంత్ రెడ్డి తెలిపారు.దీంతో పాత పాలక వర్గం అంటే 14.08.2025 నాటికి పదవుల్లో ఉన్న పాలకవర్గమే కొనసాగుతుందని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. 11.09.2025 నాడు డీసీవో ఇచ్చిన ఉత్తర్వులు చెల్లనేరవని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు చెప్పారు. హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి తాను సొసైటీ చైర్మన్‌గా కొనసాగుతానని ఆయన తెలిపారు.



# చైతన్య జ్యోతి ఐలమ్మ



**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం దేశాయిపల్లి గ్రామంలో బిసి, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో చాకలి చిట్యాల ఐలమ్మ 130 వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆ రోజుల్లో భూమికోసం, భుక్తి కోసం, వేట్టి చాకిరి విముక్తి కోసం, బాంచన్ కాల్లు మొక్కుతా అనే బానిసత్వానికి వ్యతిరేకంగా దొరలకు, దేశముకులకు, జాగిరిదారులకు, భూస్వాములకు వ్యతిరేకంగా ఎదురు నిలిచి పోరాడిన భారత విప్లవ కమ్యూనిస్టు యోధురాలు చాకలి చిట్యాల ఐలమ్మ అని పలువురు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలోపొన్నాల దేవయ్య, పొన్నాల లచ్చయ్య, పొన్నాల రాజేశం, పొన్నాల అంజయ్య, మాడిశెట్టి గంగన్న, మాడిశెట్టి జనార్ధన్, బూరుగుమోహన్, బత్తిని హరీష్ గౌడ్, బత్తిని అనిల్ గౌడ్, కుర్మ రవి, తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం

## – స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహణ

**వేద న్యూస్, చొప్పదండి:**




చొప్పదండి మున్సిపల్ కమిషనర్ నాగరాజు ఆధ్వర్యంలో కార్యాలయంలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమంను శుక్రవారం నిర్వహించారు. మున్సిపాలిటీ ప్రాంత పరిశుభ్రతతకు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పారిశుద్ధ కార్మికులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య, తాగునీటి విభాగాల కార్మికులకు సన్మానం చేశారు. రక్షణ కవచాల పంపిణీ, ఆరోగ్య పరీక్షలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిథిగా యూనిసెఫ్ జిల్లా సమన్వయకర్త కిషన్ స్వామి హాజరై మాట్లాడుతూ.. ఈ కార్మికుల సేవలు వెలకట్టలేనివి, వారు వారి కుటుంబం ఆరోగ్యంగా ఉన్నప్పుడు వారు ఊరికి మంచి సేవలు అందించే అవకాశం ఉందని, అందుకే ఆరోగ్య శిబిరం ప్రత్యేకంగా నిర్వహించడం జరిగిందని, ప్రత్యేకంగా రూపొందించిన ఆరోగ్య కార్డుల పంపిణీ చేశామని తెలిపారు. స్వచ్ఛభారత్ మిషన్ సమన్వయకర్తలు రమేష్, వేణు ప్రసాద్ తడి పొడి చెత్త నిర్వహణ, రక్షణ కవచాల వినియోగం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలను గురించి వివరించారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ సురేందర్ మాట్లాడుతూ.. మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది పని వేళల్లో తగిన ఆహారం తీసుకోవాలని, దుమ్ము, దూళి మురుకి నుండి రక్షణకు తగు కవచాలు వాడాలని, ప్రతి నెల వైద్య శిబిరాలు వినియోగించుకోవాలని ప్రత్యేక వైద్య నిపుణులు పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్నారని ప్రతి మంగళ, శుక్రవారంలలో ఆరోగ్య శిబిరాలను సద్వియోగం చేసుకోవాలని సూచించారు.

# దుర్గామాత వద్ద కుంకుమ పూజ

**వేద న్యూస్, గంగాధర:**



గంగాధర మండలం గట్టుబుత్కూర్ గ్రామంలో దేవి భక్త బృందం వారి ఆధ్వర్యంలో జరుగుతున్న దుర్గ దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం కుంకుమ పూజ కార్యక్రమం నిర్వహించారు. పండితులు అర్చన, వేదమంత్రాలతో పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్దలతో పూజలు నిర్వహించి పూలు,పండ్లు కొబ్బరికాయల, నైవేద్యంతో అమ్మవారిని పూజించారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారి భజనలు, పాటలతో, పవిత్రమైన ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. గ్రామంలోని మహిళలు అధికసంఖ్యలో పాల్గొని కుంకుమ పూజ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం దేవి భక్త బృందం వారు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలనుండి గ్రామములోని బస్ స్టాండ్ వద్ద అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు జరుపుతున్నామని భక్తుల కోరికలు తీరస్తూ అమ్మవారు మాగ్రామాన్ని తన చల్లని చూపులతో కాపాడుతుందని పేర్కొన్నారు.

# పిఓ, ఓపిఓలకు శిక్షణ

## - కొదురుపాక రైతు వేదికలో.. - స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో..

**వేద న్యూస్,బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక రైతు వేదికలో శుక్రవారం 2వ సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలు - 2025 నేపథ్యంలో పిఓ అలాగే ఓపిఓ, లకు శిక్షణ సమావేశం శుక్రవారం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమాన్ని శిక్షణ పరిశీలకుడు ఎం.డి. శారీఫోద్దీన్, జిల్లా పంచాయతీ అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి (అడిషనల్ డిస్ట్రిక్ట్ ఎలెక్షన్ అథారిటీ) బి. జయశీల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీఓ శ్రీధర్, ఎంఈఓ శ్రవణ్ కుమార్ ట్రైనర్లుగా బాల్ రెడ్డి, శ్రవణ్ కుమార్, శ్రీధర్, సురేంద్ర స్వామి శిక్షణను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఘనంగా వీరనారి ఐలమ్మ జయంతి

**వేద న్యూస్, బోయినిపల్లి:**




రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండల కేంద్రంతో పాటు, రత్నంపేట గ్రామంలో మండల అధ్యక్షుని ఆధ్వర్యంలో శుక్రవారం వీర వనిత చాకలి ఐలమ్మ 130 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి పూల మాలలు వేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు, కుల పెద్దలు, మహిళలు, కుల మతాలకు అతీతంగా గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విలాసాగర్ గ్రామంలోనూ ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దొరల పాలనకు చమర గీతం పాడిన వీర వనిత భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరవనిత చిట్యాల ఐలమ్మ అని కొనియాడారు. అనంతపల్లి గ్రామంలోనూ ఐలమ్మ 130 వ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేశారు. రజక సంఘం గ్రామ అధ్యక్షుడు అల్వాల ధర్మయ్య, ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రజక సంఘం నాయకులు, రజక కులస్థులు, మహిళలు, పాల్గొన్నారు.

# మహాలక్ష్మి దేవికి అభిషేకాలు

**వేద న్యూస్,శాయంపేట:**



శాయంపేట మండల కేంద్రంలోని అతి పురాతనమైన ఆరు శతాబ్దాల చరిత్ర కలిగిన మత్స్యగిరి స్వామి దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఐదో రోజు శుక్రవారం దేవాలయంలో గల మహాలక్ష్మి దేవి పంచలోహ విగ్రహానికి 108 కలశాలతో అభిషేకమును దేవాలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి వైభవంగా నిర్వహించినారు. పాలు, పెరుగు, తేనె ,పంచదార, పంచామృతాలతో పసుపు, కుంకుమలతో అభిషేకం నిర్వహించి లక్ష్మి అష్టోత్తరాలతో ప్రత్యేక పూజలు చేసినారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సామల బిక్షపతి, గ్రామ పెద్ద జిన్నా ప్రతాప్ సేనా రెడ్డి, గట్ల భగవాన్ రెడ్డి ,కర్రు రాజేష్ రెడ్డి ,బాసని సుబ్రహ్మణ్యం, నాగభూషణం మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇద్దరు రిమాండ్

## – కోర్టు వాయిదాలకు హాజరుకానందుకు..
## – ఎస్ఐ పరమేశ్

**వేద న్యూస్,శాయంపేట:**

హనుమకొండ జిల్లా శాయంపేట మండలం కాట్రపల్లి, పెద్దకొడపాక గ్రామానికి చెందిన ఇద్దరు కోర్టు వాయిదా లకు సరిగా హాజరు కానందున రిమాండ్ అయినట్లు ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు.ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం..2020 లో కాట్రపల్లి గ్రామంలో భర్తను హత్య చేసిన కేసులో, భార్య రేణుకుంట్ల రజిత కోర్టు వాయిదాలకు సరిగా హాజరు కానందున.. శుక్రవారం నాన్ బెయిల్ వారెంట్ ఎక్సెక్యూషన్ చేసి పరకాల కోర్ట్ లో ప్రవేశ పెట్టగా, పరకాల జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సాయి శరత్ నర్సంపేట సబ్ జైలుకు పదముడు రోజులు రిమాండ్ తరలించారు. అలాగే 2017లో పెద్దకోడేపాక గ్రామానికి చెందిన మంద చిన్నయ్య పై గుడుంబా కేసు నమోదు కాగా, కోర్ట్ కు సరిగా హాజరు కాలేదని నాన్ బెయిల్ వారెంట్ ఇవ్వగా, అతన్ని పరకాల జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా, మేజిస్ట్రేట్ వారెంట్ జారి చేశారని ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు.

# యోధురాలు చాకలి ఐలమ్మ

## – భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర




**వేద న్యూస్, శాయంపేట:**

చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం వీరనారి, శ్రామిక పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 130వ జయంతి సందర్భంగా భూపాలపల్లి నియోజకవర్గం శాయంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల హక్కుల కోసం భూస్వాముల అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడి, బహుజన ఆత్మగౌరవానికి, మహిళా చైతన్యానికి మార్గం చూపారన్నారు. ఆమె ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆమో యోధురాలు అని చెప్పారు. అనంతరం రజక సంఘం నేతలు ఎమ్మెల్యేకు మిఠాయి తినిపించి వేడుకలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.


# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలో రజక సంఘ సభ్యుల ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకను శుక్రవారం ఘనంగా జరిపారు. వీర వనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శపాయం అని, తెలంగాణ చరిత్రలో అణగారిన వర్గాల అత్మ గౌరవం దైర్యం పోరాటానికి ప్రతీకాగా నిలిచిన విప్లవ వీరనారి చాకలి ఐలమ్మ నేటి తరానికి ఆదర్శప్రాయం అని చెప్పారు. కార్యక్రమంలో మీరా రాజేశ్వర్, మునిగంటి శేఖర్, మీరా దేవులు, గణేష్, గంగాధర్, సత్యనారాయణ, నర్షయ్య, బాలు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బతుకమ్మ వేడుకలు



**డెస్క్:**

హనుమకొండలోని బంధన్ హాస్పటల్స్ లో బతుకమ్మ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. హాస్పటల్స్ యాజమాన్యం, వైద్యులు, సిబ్బంది కలిసి సందడిగా బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బంధన్ హాస్పటల్స్ డైరెక్టర్స్ డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ త్రినాథ్, డాక్టర్ రమేష్, డాక్టర్ నవీన్ మాట్లాడుతూ ప్రజలకు ముందస్తుగా సద్దుల బతకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు.

# పవన్ కల్యాణ్‌కు వైరల్ ఫీవర్..

## – ట్రీట్‌మెంట్ కోసం మంగళగిరి నుంచి హైదరాబాద్‌కు!



డెస్క్ : ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అస్వస్థతకు గురయ్యారు. నాలుగు రోజులుగా ఆయన వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నప్పటికీ ఆయనకు జ్వరం తీవ్రత తగ్గడం లేదు. పైగా దగ్గు కూడా ఎక్కువైంది. దీంతో పవన్ కల్యాణ్ తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలుస్తోంది. పవన్ కల్యాణ్‌కు నాలుగు రోజులుగా జ్వరం తగ్గకపోవడంతో హైదరాబాద్‌కు వెళ్లి వైద్యం చేయించుకోవాలని మంగళగిరి వైద్యులు సూచించారు. డాక్టర్ల సూచన మేరకు పవన్ కల్యాణ్ వైద్య పరీక్షల కోసం ఇవాళ మంగళగిరి నుంచి హైదరాబాద్‌కు వెళ్లనున్నారు. పవన్ కల్యాణ్ జ్వరంతో బాధపడుతున్నప్పటికీ సోమవారం నాడు అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. ఆ రోజు రాత్రే పవన్ కల్యాణ్‌కు జ్వరం పెరిగింది. దీంతో విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. కానీ రెస్ట్ తీసుకోకుండా శాఖపరమైన అంశాలపై అధికారులతో డిప్యూటీ సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారని జనసేన పార్టీ తెలిపింది.

# ఏం చేసుకుంటారో చేస్కోండి

స్కీమ్ ఉంటది.. దాని వెనుకాల ఓ స్కాం ఉంటుంది. ఇది పక్కా.. ఆయన పేరుకే ముఖ్యమంత్రి కానీ ఆయన దందా బ్లాక్ మెయిల్. ఇవాళ చెప్పింది చిన్న విషయం.. ఇంకో నాలుగైదు రోజుల్లో ఒక పెద్ద విషయం కూడా చెబుతాను. ఇంకో కార్పొరేట్ సంస్థను ఎట్ల బ్లాక్ మెయిల్ చేశాడో అది కూడా చెప్తాను. ఆధారాలతో సహా చెప్తాను అని కేటీఆర్ తెలిపారు.

కాంగ్రెసోళ్లు రెండేండ్లుగా కలలు కంటూనే ఉన్నారు. వాళ్ల కళ్లు కాయలు కాస్తున్నాయి. మమ్మల్ని అరెస్టు చేసుకుంటారా.. ఏం చేసుకుంటారో చేస్కోండి.. నేను ఏ తప్పు చేయలేదు. ఎంత ధైర్యం ఉంటే.. నేను ఒక మంత్రిగా పదేండ్లు పని చేశాను.. లై డిటెక్టర్ టెస్టుకు సిద్ధమని చెప్పాను. సీఎంను అడిగాను.. ఆయన స్పందించలేదు. ఏసీబీ కేసు ఇద్దరి మీద ఉంది.. మీ కెమెరాల ముందే లైడిటెక్టర్ టెస్ట్ తీసుకుంటా రండి అని చెప్పాను. ఇప్పుడు కూడా అదే ఆఫర్ ఇస్తున్నా.. నేను తప్పు చేయలేదు కాబట్టి నిజాయితీకి ధైర్యం ఎక్కువ.. నేను తప్పు చేయలేదు కాబట్టి నాకు ఆధైర్యం ఉంది. అరెస్టు చేసుకుంటారా..? ఏం చేసుకుంటారో వదిలేయండి. నన్ను అరెస్టు చేస్తే పైశాచిక ఆనందం వస్తుండొచ్చు సీఎం రేవంత్ రెడ్డికి అది కూడా ఒకే. కానీ మేం కాంగ్రెస్ పార్టీని వదిలిపెట్టం.. 4 వేల పెన్షన్.. తులం




బంగారం, స్కూటీ ఇవన్నీ ఇచ్చేదాకా కాంగ్రెస్ ను వెంటాడుతూనే ఉంటాం.. నీవెన్ని డైవర్షన్ గేమ్‌లు ఆడినా మేం వదిలిపెట్టం కాంగ్రెస్ పార్టీని అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

# వరసగా ఐదోరోజూ నష్టాల్లోనే..

**డెస్క్:**




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా ఐదోరోజూ గురువారం కూడా నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ 25వేల దిగువకు చేరింది. గురువారం నిఫ్టీ 166.05 పాయింట్ల నష్టంతో 24,890.85 వద్ద ముగిసింది. అలాగే సెన్సెక్స్ ఉదయం 81,574.31 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,715.63) నష్టాల్లో ప్రారంభమైంది. ప్రారంభంలో కాసేపు లాభాల్లోకి వచ్చినా రోజంతా నష్టాల్లోనే కదలాడింది. చివరికి 555.95 పాయింట్ల నష్టంతో 81,159.68 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో బిఇఎల్, భారతీ ఎయిర్‌టెల్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు మినహా మిగిలిన షేర్లు నష్టాలు చవిచూశాయి. ట్రెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టాటా మోటార్స్, టీసీఎస్, ఏషియన్ పెయింట్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఆసియా మార్కెట్‌ల్లో జపాన్ మినహా మిగిలిన మార్కెట్‌లు నష్టాల్లో ముగిశాయి. యూరోపియన్ మార్కెట్‌లు నష్టాల్లో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 69 డాలర్లు, బంగారం ఔన్సు 3758 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. మదుపర్ల సంపదగా భావించే బిఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.3 లక్షల కోట్లు క్షీణించి రూ.457.4 లక్షల కోట్లకు చేరింది. విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు, హెచ్–1బీ వీసా రుసుము పెంపు, ట్రంప్ సుంకాలు వంటి ఆందోళనల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలూ ప్రభావం చూపాయి.

# త్వరలో పర్సనల్ కంప్యూటర్ల కోసం ఆండ్రాయిడ్ ఓఎస్

ఆపరేటింగ్ సిస్టమ్‌కు సంబంధించి గూగుల్ సరికొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటివరకు మొబైళ్లకే పరిమితమైన ఆండ్రాయిస్ ఓఎస్‌ను భవిష్యత్తులో పర్సనల్ కంప్యూటర్లలోనూ తీసుకురావాలని భావిస్తోంది. ఇప్పటివరకు ఆండ్రాయిడ్ ఓఎస్ చిన్న పరికరాలకే పరిమితం అయింది. గతంలో కంప్యూటర్లలో క్రోమ్ ఓఎస్‌ను ప్రారంభించినప్పటికీ, ఆశించిన స్థాయిలో ఆదరణ పొందలేదు. దీంతో ఇప్పటికీ పర్సనల్ కంప్యూటర్ విభాగంలో యాపిల్ మ్యాక్ ఓఎస్, మైక్రోసాఫ్ట్ విండోస్ ఓఎస్‌లదే ఆధిపత్యం కొనసాగుతోంది. అయితే, పీసీల మార్కెట్లో గూగుల్ మరోసారి ఆండ్రాయిడ్ ఓఎస్‌ను తీసుకురావాలని భావిస్తోంది. దీనికోసం ఆండ్రాయిడ్, క్రోమ్ ఓఎస్‌ను విలీనం చేసేందుకు సిద్ధమైంది. తాజాగా హవాయి కేంద్రంగా జరిగిన స్నాప్ డ్రాగన్ సమ్మిట్‌లో గూగుల్ ప్రతినిధి ఈ విషయంపై స్పష్టత ఇచ్చారు. పర్సనల్ కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్‌లకు వేర్వేర్ ఆపరేటింగ్ సిస్టమ్(ఓఎస్) ఉన్నాయి. ఈ రెండింటిని విలీనం చేస్తామని, పీసీలకు ఆండ్రాయిడ్ ఏఐ, జెమిని ఏఐ ఫీచర్లు యాడ్ చేయనున్నాం. మా అప్లికేషన్‌లు, డెవలపర్ కమ్యూనిటీలన్నింటినీ పీసీ డొమైన్‌లోకి తీసుకురావడంపై కలిసి చేస్తున్నాం. కంప్యూటర్ విభాగంలో అందరికీ ఆండ్రాయిడ్ సేవలందించేందుకు ఇదొక మార్గమని భావిస్తున్నట్టు గూగుల్ ప్రతినిధి ఓస్టర్‌లోహ్ వివరించారు. కాగా, ఎంట్రీ లెవల్ కంప్యూటర్లలో మెరుగైన సేవల కొసం క్రోమ్ ఓఎస్‌ను గూగుల్ అందిస్తోంది. కానీ, అది పూర్తిస్థాయిలో విజయవంతం కాకపోవడంతో ప్రస్తుతం పీసీ మార్కెట్లో క్రోమ్ ఓఎస్ వాటా 7 శాతం వద్దే ఉంది. విండోస్ ఇప్పటికీ దాదాపు 80 శాతం వాటాతో ఆధిపత్యం కొనసాగిస్తోంది.




# భారీ వర్షాలతో ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది

**డెస్క్:**

రాష్ట్రంలో రెండు రోజులుగా కురుస్తోన్న భారీ వర్షాల పట్ల ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు గారు, డీజీపీ జితేందర్ గారితో కలిసి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు అప్రమత్తంగా ఉంటూ ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగింది. గడిచిన 24 గంటల్లో భారీ వర్షాలు కురిసిన రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో చేపట్టాల్సిన చర్యలు, రాబోయే 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న జిల్లాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశాం. ఇరిగేషన్, రవాణా, విద్యుత్, హైడ్రా, జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ విభాగాలు సమన్వయంతో పనిచేసి జనజీవనానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించాము.

వికారాబాద్ జిల్లాలో కురిసిన అతిభారీ వర్షాల వల్ల మూసీ నదిలోకి భారీ వరద వస్తుండడంతో నదీ పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించాము. ఇప్పటికే లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న55 మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మూసీ నదిలో నీటి ఉధృతి పెరుగుతున్ననేపథ్యంలో అధికారులు నిరంతరం పర్యవేక్షణలోనే ఉండాలని సూచించాము.

హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ జలాశయాలకు వస్తోన్న వరదను ముందుగానే అంచనా వేసి అంతే పరిమాణంలో ఈ రెండు జలాశయాల నుంచి దిగువకు నీటిని విడుదల చేయాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవసరమైతే షెల్టర్ హోమ్‌లను సిద్ధం చేసుకోవాలని ఆదేశించాము.

ఇప్పటికే రాష్ట్రంలో చెరువులు, కుంటలు పూర్తి స్థాయిలో నిండాయి. రాబోయే వర్షాల వల్ల



చెరువులు, కుంటలకు గండ్లు పడకుండా నీటిపారుదల శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండే లో-లెవెల్ కాజ్‌వేలు వద్ద ప్రమాదాలు జరగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలి. జలాశయాలు, జల వనరుల వద్ద సెల్ఫీలు దిగకుండా యువతను నివారించాలి. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు రెస్క్యూ ఆపరేషన్ టీమ్ లు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్టీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించాలని అధికారులకు సూచించడం జరిగిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

వేద న్యూస్

శనివారం సెప్టెంబర్ 27, 2025

# సంపాదకీయం

నిర్లక్ష్యపు నీడలలో

శాతవాహనుల రాజధాని

అవిభక్త కరీంనగర్ జిల్లాకు 50 వేల సంవత్సరాలకు పూర్వపు చరిత్ర ఉంది. చరిత్రలో ఆంధ్రులకు లభించినంత వరకు , శాత వాహనుల మొట్ట మొదటి రాజవంశం, ఆదీ మహా రాష్ట్ర లోని పైఠానో లేక నాసిక ప్రాంతమో అనుకుంటే కాదని, అంతకు ముందే వీరు ఆంధ్రులని, కరీంనగర్ జిల్లా నే వారి మూల పురుషులకు ఆవాస స్థానమని, చారిత్రక పరిశోధనలు స్పష్టం చేశాయి. శాతవాహన వంశానికి మూలపురుషుడు అని భావింపబడే శ్రీముఖుడు కోటి లింగాలను రాజధానిగా చేసుకుని పాలించాడని స్పష్టం అయినాక, ఆయన నాణేలు కోటిలింగాలలో లభ్యమైనాక చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. జిల్లా కేంద్రమైన కరీంనగర్ కు 65 కి.మీ .ల, ధర్మపురి క్షేత్రానికి 19 కి.మీ.ల దూరాన వెల్గటూర్ మండలం లోని గోదావరి, పెద్దవాగు సంగమ స్థాన మందుగల కోటిలింగాల లోని పుట్ట కోట గోడలు (పూర్వపు కోటలు) ఆంధ్రదేశ పాలకులైన శాతవాహనుల తొలి రాజులకు ఆటపట్టయినవి. ఆంధ్రుల తొలిరాజుగా పురాణాలలో వర్ణించ బడిన శ్రీముఖ చక్రవర్తి నాణాలను , కప్పారావు పేట సమీపాన, ధర్మపురి వాస్తవ్యులు ప్రముఖ చారిత్రక పరిశోధకులు, పురావస్తు శాఖలో ఎపిగ్రాఫిక్ అసిస్టెంట్ (శాసన వ్యాఖ్యాత)గా పనిచేస్తూ మరణించిన సంగనభట్ల నరహరి శర్మ సేకరించి, పురావస్తు శాఖకు అప్పగించడంతో , ఈ ప్రాంత ప్రాశస్త్యం వెలుగు చూడగలిగింది. శాతవాహన కాలానంతర మైనట్టి వారికి ఉద్యోగ చెందిన "మహా తలవర, మహా సేనాధిపతిపతిస" ఆను నాణెములు ఇచ్చట లభించినవి. విదిశా నగరమును కేద్రముగా ఏలిన చివరి శుంగ రాజుల నాణెములు లభింపగా, వాటిపై బ్రాహ్మీ లిపిలో "రజోగోబదస, రజో సమగోపస" అని వ్రాసి ఉన్నవి. శుంగుల అనంతరం మగధను ఏలారని పురాణాలలో పేర్కొనిన కాణ్వ రాజుల నాణెములు కూడా లభించాయి. వీటి ఆధారంగా పురాణములందు పేర్కొన్నట్లు, మగధ రాజ్యమును మౌర్యుల అనంతరం శృంగులు, కాణ్వులు పిదప ఆంధ్రులు వరుసగా పాలించినట్లు తార్కాణం ఇచ్చు చున్నదని పురావస్తు శాఖ మాజీ డైరక్టర్ పుచ్చా వాసుదేవ పరబ్రహ్మ శా స్త్రీ సోదాహరణంగా నిరూపించారు. వీటిలో కొన్ని కోటిలింగాల పొలములలో బ్రాహ్మీ లిపి లోని శిలా ఫలకాలు వెలుగు చూశాయి. ఇచట లభించినట్లు అపు రూప నాణెములు వేరెచ్చటా లభించని కారణంగా , కోటిలింగాల శాతవాహనుల తొలి రాజధాని అని, పరిసర ప్రాంత కేంద్ర స్థానమని స్పష్టమైంది. కోటిలింగాలలోనే నరహరిశర్మ పంచమార్క్ నాణేలు , ఇతర అపు రూప నాణేలు సేకరించి పురావస్తు శాఖకు హస గతం చేశారు. వానిలో "రజో శాతవాహ , రజో సాతకంనిస" ఆని బ్రాహ్మీ లిపిలో వ్రాయ బడింది. లిపి ప్రకారం శ్రీముఖుని కన్నా ఇవి ప్రాచీనమైనవి. సహజంగా ఉండవలసిన ఉజ్జయిని చిహ్నం వీటిలో లేదని నరహరి పరిశోధనలో పేర్కొన్నాడు. శాతవాహన కాలపు పొరల్లో అనేక శాతవాహన నాణేలు లభించాయి. లభ్యమైన నాణెములను బట్టి శాతవాహన వంశ మూల పురుషుడైన శాత వాహనుడు ఆంధ్ర గోపులను , శబరులను, మహా తలవరులను, తదితర ఆంధ్ర రాజులను ఓడించి శాతవాహన సామ్రాజ్యాన్ని స్థాపించాడు. శాతవాహనులు తొలుత ఆంధ్రుల పాలనలో భాగమై, ఆంధ్ర భృత్యులుగా ఉండి, బలవంతులై సామ్రాజ్య స్థాపనకు పూనుకున్నారని, శ్రీముఖుడు చివరి కాణ్వరాజును అంతమొందించి, స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పరచి, విస్తరించారని జగిత్యాలకు చెందిన ప్రముఖ చారిత్రక పరిశోధకులు, రిటైర్ రీడర్ డాక్టర్ జైశెట్టి రమణయ్య కరీంనగర్ చారిత్రక సంస్కృతి గ్రంథంలోని వివరించారు. హాల చక్రవర్తి గాథా సప్తశతి లోని గోదావరి వర్ణన ఆధారంగా, లభ్యమైనట్లు శ్రీముఖ నాణాలను బట్టి కోటిలింగాల, శాతవాహనుల బలిష్ట దుర్గమని స్పష్టం అవుతున్నది. కోటిలింగాల సమీపమున గల గుట్ట జైన మునులకావాస స్థానముగ నుండేదని తెలుస్తున్నది. సమీపాన క్రీ.పూ.రెండవ శతాబ్దపు బౌద్ధ స్తూపం పాపాయిగాం గుట్టపైన ఉండేది. ప్రస్తుతం మధ్య యుగానికి చెందిన దేవాలయం గ్రామంలో ఉంది. రెండు గర్భగృహాలకు ఉమ్మడి మంటపముంది. ప్రతి గర్భగృహంలో అంతరాళం ఉంది. ప్రధానాలయంలో కోటీశ్వరుడు లింగ రూపుడుగా ప్రతిష్ఠితుడు కాగా, దక్షిణ దిశలో ఉత్తర ముఖ గర్భగృహంలో అంతరాళం ఉంది. ప్రధాన ఆలయంలో కోటీశ్వరుడు లింగ రూపుడై ఉన్నాడు. ఆలయం చాళుక్య రీతులలో నుండి, గోదావరి ఒడ్డున అనేక శిల్ప ప్రతిమ లున్నాయి. పురావస్తు శాఖచే త్రవ్వకాలు జరపబడి, పర్యాటక శాఖ గుర్తింపు పొందింది ఈ ప్రదేశం. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాక్చరిత్రకు నిలువెత్తు నిలువుటద్దంగా నిలిచి, శాతవాహనుల తొలి రాజధానిగా చరిత్ర పుటలకెక్కి, జిల్లా సంతరించుకున్న జిల్లా చరిత్ర గతినే మార్చి, విశేష ప్రాధాన్యత కోటిలింగాల ఒడ్డు, గోదావరి నీటి వల్ల నానాటికీ కోతకు గురవు తున్నది. తవ్వకాలు జరిపితే చారిత్రక సత్యాలెన్నో వెలికి తీయగల చరిత్రకు పూర్వపు గ్రామం, ప్రమాదపు టంచున పయనిసున్నది. స్థానికుల, దాతల చేయూత, ధర్మకర్తల మండళ్ళ కృషితో, ప్రత్యేక నిధులను ప్రోగు చేసుకుని దేవస్థానాన్ని అభివృద్ధి పరుచుకుంది. పర్యాటక శాఖ ఈ గ్రామంపై చాలా కాలం చిన్నచూపే చూసింది. గతంలో చాలా సందర్భాలలో ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రముఖ పర్యాటక స్థలంగా తీర్చిదిద్ద గలమని ఇచ్చిన హామీలు, చేసిన ప్రకటన – నీటి మూటలు గానే మిగిలి పోయాయి. జిల్లాకు చెందిన కేంద్ర, రాష్ట్ర సాయి నాయకులు, ఉన్నతాధికారులు , చారిత్రక విషయాసక్తులైన వ్యక్తులు, రాష్ట్ర చరిత్రలో ప్రధాన ప్రదేశమైన కోటిలింగాలలో ప్రత్యేక అభివృద్ధి పనులు, ప్రాచీన చారిత్రక అవశేషాల సంరక్షణా చర్యలను చేపట్టడంపై, నిర్ణయాత్మక కార్యక్రమాలను చేపట్టడంలో ఆలసత్వాన్నే ప్రదర్శించారు. ఈ కారణంగానే ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాచీన చరిత్రకు సాక్షీ భూతంగా నిలిచిన కోటిలింగాల నేడు కాలగర్భంలో కలిసి పోయే ప్రమాదంలో ఉంది. శ్రీపాద పాజెక్టు నిర్మాణ చర్యలలో భాగంగా చారిత్రక గ్రామానికి వరద ముప్పు భయభ్రాంతులకు గురి చేస్తున్నది. దీనితో ఈ గ్రామ చరిత్ర పుటల నుంచి కనుమరుగు అయ్యే ప్రమాదమూ లేకపోలేదు. ఈ విషయాన్ని ఆలస్యంగా నైనా గ్రహించిన జిల్లా మేధావి వర్గం, కోటి లింగాలను పరిరక్షించే చర్యలు గైకొనాలని గత ప్రభుత్వానికి విన్నవించింది. రాష్ట్ర రాజధాని నుండి సైతం ఈ అంశంపై అవగాహన కలిగిన దివంగత ప్రభుత్వ సలహాదారు విద్యాసాగర్ రావు, మల్లేపల్లి లక్ష్మయ్య, ఆచార్య జయధీర్ తిరుమల రావు, నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజిరెడ్డి, ఐకాస కన్వీనర్ కోదండరాం, తెలంగాణ జాగృతి వ్యవస్థాపకులు కవిత, కవి గాయకులు దేశపతి శ్రీనివాస్, కుర్రా జితేంద్ర బాబు లాంటి మేధావులను రప్పించి, కోటిలింగాల పరిస్థితిని ప్రత్యక్షంగా చూపించి, తద్వారా గత ప్రభుత్వం దృష్టి ఆకర్షించి, పరిరక్షించే ప్రయత్నం చేసింది. అపురూప నాణేలు లభ్యమైన కోటిలింగాల గ్రామం ఖాళీ అయితే, త్రవ్వకాలకు మరింత సానుకూలత ఉండగలదనే ప్రతిపాదన అందుకున్న రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ చెన్నారెడ్డి అందుకు సానుకూలంగా స్పందించి, కోర్ కమిటీ నిర్ణయాన్ని అనుసరించి తవ్వకాలు జరిపేలా కృషి సల్పగలమని ప్రకటించి నామ మాత్రపు తవ్వకాలు చేపట్టి చేతులెత్తేయడం జరిగింది. శ్రీశైలం ప్రాజెక్టు ముంపుకు గురికాకుండా ఆలంపూర్ లో నిర్మించినట్లు, కోటిలింగాల పరిరక్షణ గోడలు నిర్మించాలనే ప్రతిపాదన చాలా కాలంగా కాగితాలకే పరిమిత మైంది. గతంలో నాటి సంబంధిత మంత్రి పొన్నాల లక్ష్మయ్య వద్ద ప్రతిపాదనలు ఉన్నా, పట్టించు కోలేదు. తెరాస ప్రభుత్వ సంబంధిత గత కార్యదర్శి వెంకటేశం దర్శించి, తగు చర్యలు తీసుకునేందుకు సానుకూలత వ్యక్తం చేశారు.

# సరికొత్త రికార్డును సృష్టించిన అభిషేక్ శర్మ

**డెస్క్:** టీమిండియా యువ సంచలనం, బ్యాటర్ అభిషేక్ శర్మ ఆసియా కప్ చరిత్రలో సరికొత్త రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఒకే ఎడిషన్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగా నిలిచి, శ్రీలంక దిగ్గజ క్రికెటర్ సనత్ జయసూర్య పేరిట ఉన్న 17 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టాడు.నిన్న బంగ్లాదేశ్‌తో జరిగిన ఆసియా కప్ 2025 సూపర్ ఫోర్ మ్యాచ్‌లో అభిషేక్ ఈ అరుదైన ఘనతను అందుకున్నాడు. అద్భుతమైన ఫామ్‌లో ఉన్న అతడు బంగ్లా బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 37 బంతుల్లోనే 6 ఫోర్లు, 5 భారీ సిక్సర్ల సహాయంతో 75 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఈ క్రమంలో కేవలం 25 బంతుల్లోనే తన హాఫ్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు.ఈ ఇన్నింగ్స్‌లో బాదిన 5 సిక్సర్లతో ఈ టోర్నీలో అభిషేక్ మొత్తం సిక్సర్ల సంఖ్య 16కి చేరింది.




దీంతో 2008లో సనత్ జయసూర్య నెలకొల్పిన 14 సిక్సర్ల రికార్డు కనుమరుగైంది. ఆసియా కప్ చరిత్రలో ఒకే ఎడిషన్‌లో 15కు పైగా సిక్సర్లు కొట్టిన ఏకైక క్రికెటర్‌గా అభిషేక్ శర్మ నిలవడం విశేషం.శతకం చేసేలా కనిపించిన అభిషేక్, షార్ట్ థర్డ్ మ్యాన్‌లో ఉన్న ఫీల్డర్ రిషాద్ హుస్సేన్ అద్భుతమైన ఫీల్డింగ్‌కు రనౌట్‌గా పెవిలియన్ చేరాడు.

# వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్‌కు ఆడబోయే ఇండియా జట్టు ఇదే

డెస్క్ : వెస్టిండీస్‌తో అక్టోబర్ 2 నుంచి జరగనున్న టెస్ట్ సిరీస్ కు భారత జట్టును బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ప్రకటించారు. ఆసియా కప్ టోర్నీ కోసం దుబాయ్ లో ఉన్న భారత టెస్టు జట్టుసారథి శుభ్‌మన్ గిల్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌తో అగార్కర్ తాజాగా భేటీ అయ్యారు. టెస్టు జట్టు కూర్పుపై వారితో చర్చించాక జట్టును ప్రకటించారు. రెండు టెస్టుల ఈ సిరీస్ లో టీమిండియా శుభ్ మన్ గిల్ సారథ్యంలో విండీస్ తో తలపడనుంది.వైస్ కెప్టెన్ గా రవీంద్ర జడేజాను, రిషబ్ పంత్ స్థానంలో ఎన్.జగదీశన్ ను సెలెక్టర్లు ఎంపిక చేశారు. ఇంగ్లాండ్ పర్యటనలో పెద్దగా రాణించని కరుణ్ నాయర్, శార్దూల్ ఠాకూర్ లను పక్కన పెట్టారు. కాగా, జస్‌ప్రీత్ బుమ్రా రెండు టెస్టులకూ అందుబాటులో ఉంటాడని అగార్కర్ పేర్కొన్నారు. షమీ ఫిట్‌నెస్‌పై ఇంకా అప్‌డేట్ రాలేదన్నారు. కరుణ్ నాయర్ తమ అంచనాలను అందుకోలేకపోయాడని అగార్కర్ చెప్పారు. శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రవీంద్ర జడేజా (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, దేవదుత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్ (బ్యాకప్ వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్,



జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీశ్, జగదీశన్ (వికెట్ కీపర్), సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్‌దీప్ యాదవ్.


## భారత మార్కెట్లోకి స్కోడా ఆక్టేవియా రీఎంట్రీ.. ఈ ఏడాది కోసం 100 కార్ల దిగుమతి

ప్రముఖ కార్ల తయారీ సంస్థ స్కోడా ఆటో ఇండియా తన మొదటి తరం సెడాన్ మోడల్ ఆక్టేవియాను తిరిగి భారత మార్కెట్లోకి తీసుకురానుంది.ఇటీవల కంపెనీ విడుదల చేసిన తన కాంపాక్ట్ ఎస్‌యూవీ కైలాక్ కస్టమర్ల ఆదరణ పొందడంతో దేశీయ మార్కెట్లో మరింత దూకుడుగా పోటీ ఇచ్చేందుకు తన హై-ఎండ్ సెడాన్ ఆక్టేవియా ఆర్ఎస్‌ను తీసుకురానుంది. ఆక్టేవియా ఆర్ఎస్ ప్రీ-బుకింగ్‌లు అక్టోబర్ 6 నుంచి ప్రారంభమవుతాయి. నవంబర్ 6 నాటికి డెలివరీలు జరుగుతాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ఏడాది కోసం కంపెనీ పూర్తిగా తయారైన దాదాపు 100 కార్లను దిగుమతి చేసుకోనుంది. ఆ తర్వాత స్థానికంగా కారును అసెంబుల్ చేయడంపై దృష్టి సారిస్తుంది. యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లో ఈ కారు ధర 39,965 యూరోలు (మన కరెన్సీలో రూ. 47.7 లక్షలు) ఉంది. అయితే, ఈ కారును పూర్తిగా తయారైన యూనిట్‌ను దిగుమతి చేస్తున్న నేపథ్యంలో మన మార్కెట్లో ధర ఇంకా ఎక్కువగా ఉండోచ్చని భావిస్తున్నారు. స్కోడా తన సెడాన్ విభాగంలో ఆక్టేవియా కారును మొదటిసారిగా 2001లో లాంచ్ చేసింది. కార్బన్ ఉద్గారాల నిబంధనల కారణంగా 2023లో ఈ మోడల్‌ను కంపెనీ నిలిపేసింది. దేశంలో ప్రస్తుతం దాదాపు 1,00,000 ఆక్టేవియా కార్లు ఉన్నాయి. మళ్లీ ఇటీవల కంపెనీ నుంచి వచ్చిన కైలాక్ మోడల్ కారణంగా దేశీయ మార్కెట్లో స్కోడా బ్రాండ్‌కు ఆదరణ పెరిగింది. ముఖ్యంగా కైలాక్‌కు డిమాండ్ కారణంగా స్కోడా ఈ ఏడాది జనవరి-ఆగస్టు మధ్య దాదాపు 30,000 కైలాక్ కార్లను విక్రయించింది. మిగిలిన మోడళ్లలో 17,000 కుషాక్, స్లావియా కార్లు ఉన్నాయి. జనవరి-ఆగస్టు మధ్య కంపెనీ అమ్మకాలు దాదాపు 135 శాతం పెరిగాయి.

# హైకోర్టు ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే

డెస్క్ : వైఎస్సార్సీపీ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) లడ్డూల తయారీలో కల్తీ నెయ్యి వాడారన్న ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ కేసులో ఇటీవల ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంతో ఈ వ్యవహారం మళ్లీ చర్చనీయాంశమైంది. తిరుమల లడ్డూ కల్తీ కేసులో వైవీ సుబ్బారెడ్డి, చిన్నప్పన్నకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కాగా గతంలో సీజేఐ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం చిన్నప్పన్నకు నోటీసులు జారీ చేసింది. దీంతో సిట్‌లో సుప్రీంకోర్టు చెప్పినవాళ్లను కాకుండా మరొకరిని తీసుకున్నారంటూ చిన్నప్పన్న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సిట్‌లో లేని వ్యక్తి విచారణకు రావాలంటున్నారని హైకోర్టులో చిన్నప్పన్న పేర్కొన్నారు. ఈ ఏడాది జులై 10న హైకోర్టు సింగిల్ జడ్జి చిన్నప్పన్న పిటిషన్‌పై తీర్పు ఇచ్చింది. సీబీఐ ఏర్పాటు చేసిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ లో సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఇద్దరు సీబీఐ అధికారులు, ఇద్దరు రాష్ట్ర పోలీసు అధికారులు, ఒక ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ అధికారి ఉండాలని హైకోర్టు గుర్తు చేసింది. కానీ, సీబీఐ డైరెక్టర్ ఆదేశాలతో జె వెంకటరావు అనే అధికారి, అధికారికంగాలో లేకపోయినా విచారణలో కీలకపాత్ర పోషించారని హైకోర్టు అభిప్రాయపడింది. దీంతో సీబీఐ డైరెక్టర్ సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించారని హైకోర్టు వ్యాఖ్యానించింది. హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సీజేఐ బి.ఆర్. గవాయి, జస్టిస్ కె. వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును శుక్రవారం విచారించింది. సీబీఐ తరఫున సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.మొత్తంగా సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలోనే ఉందని అని ఆయన వివరించారు. అధికారులు ఒకరిని విచారణకు నియమిస్తే అందులో తప్పేముంది? దర్యాప్తు పర్యవేక్షణ సీబీఐ డైరెక్టర్ చేతిలోనే ఉంది" అని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. చిన్నప్పన్న తరఫున వాదించిన న్యాయవాది మాత్రం "వెంకటరావు దర్యాప్తు అధికారి పాత్ర పోషిస్తూ, తన క్లయింట్‌ను ఒత్తిడి చేస్తున్నారని" తెలిపారు.

## ఖచ్చితమైన రాబడి కోసం బ్యాంక్ ఎఫ్‌డిలు.. ప్రైవేట్ బ్యాంకుల నుండి అదనపు వడ్డీని పొందండి!




**డెస్క్:**

చాలామంది పెట్టుబడిదారులు, పెట్టుబడి పథకాల విస్తృత శ్రేణి అందుబాటులో ఉన్నప్పటికీ, బ్యాంక్ డిపాజిట్‌లు అందించే భద్రత కారణంగా ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను ఇష్టపడతారు.ప్రభుత్వ రంగ బ్యాంకుల కంటే ప్రైవేట్ బ్యాంకులు 0.5% నుండి 1% వరకు అదనపు వడ్డీ రేట్లను అందిస్తున్నాయి, ఇది రిస్క్-విముఖత కలిగిన పెట్టుబడిదారులకు, ముఖ్యంగా సీనియర్ సిటిజన్‌లకు మరియు గ్రామీణ ప్రాంతాలలోని వారికి ఆకర్షణీయమైన ఎంపికగా నిలుస్తుంది.తప్పనిసరిగా స్థిరమైన మరియు హామీతో కూడిన రాబడిని కోరుకునే వారికి, బ్యాంక్ ఎఫ్‌డిలు ఆదర్శవంతమైన పెట్టుబడి మార్గాన్ని అందిస్తాయి. సీనియర్ సిటిజన్‌లు మరియు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు, తరచుగా సురక్షితమైన పెట్టుబడులకు ప్రాధాన్యత ఇస్తారు, ఇప్పటికీ బ్యాంక్ ఎఫ్‌డిలను తమ ప్రాథమిక ఎంపికగా చూస్తారు. మార్కెట్ అస్థిరత నుండి మూలధనాన్ని రక్షించేటప్పుడు క్రమబద్ధమైన రాబడిని అందించే సామర్థ్యం ఈ ఆదరణకు కారణం. అయితే, ఎఫ్‌డిలో పెట్టుబడి పెట్టే ముందు, అందుబాటులో ఉన్న వివిధ ఎంపికల వడ్డీ రేట్లను సరిపోల్చడం చాలా ముఖ్యం. అనేక ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగ బ్యాంకులు 1, 3 మరియు 5 సంవత్సరాల కాలానికి వేర్వేరు వడ్డీ రేట్లను అందిస్తాయి. ఈ రేట్లను సరిపోల్చడం ద్వారా పెట్టుబడిదారులు తమ పెట్టుబడిపై అత్యధిక రాబడిని పొందడానికి సమాచారంతో కూడిన నిర్ణయం తీసుకోవచ్చు. సారాంశంలో, బ్యాంక్ %ఖీణ%లు భద్రత మరియు స్థిరమైన రాబడిని కోరుకునే వారికి ఆచరణీయమైన మరియు నమ్మదగిన పెట్టుబడి సాధనంగా మిగిలి ఉన్నాయి. ప్రైవేట్ బ్యాంకుల ద్వారా అందించే మెరుగైన వడ్డీ రేట్లు, రిస్క్ లేకుండా తమ సంపదను పెంచుకోవాలనుకునే వారికి ఒక అదనపు ప్రయోజనాన్ని అందిస్తాయి. అందువల్ల, పెట్టుబడిదారులు తమ నిర్ణయాలను తీసుకోవడానికి ముందు అన్ని అవకాశాలను అంచనా వేయడం మరియు అత్యంత ప్రయోజనకరమైన ఎంపికను ఎంచుకోవడం చాలా అవసరం.




Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073